

విద్యుత్ బకాయిలు రూ.319.77 కోట్లు

ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్‌లో ప్రభుత్వ సంస్థల నుంచి రావలసింది రూ.124.03 కోట్లు

- మైనర్‌పంచాయతీల నుంచి రూ.170.76 కోట్లు
- జీవీఎంసీ బకాయి రూ.22.96 కోట్లు
- మునిసిపాలిటీలు రూ.2.03 కోట్లు
- విశాఖ కలెక్టరేట్ రూ.8.18 కోట్లు
- రోడ్లు, భవనాల శాఖ రూ.6.17 కోట్లు

.7లో

ఫార్మా కంపెనీల్లో భద్రత కరువు

ప్రమాణాలు పాటించని పలు కంపెనీలు

జిల్లాలోని సెజ్‌లో తరచూ ప్రమాదాలు

- గత పదేళ్ల కాలంలో 45కు పైగా సంఘటనలు
- 40 మందికి పైగా మృత్యువాత
- తాజాగా రాంబిల్లి మండలంలోని వసంత్ కెమికల్స్ కంపెనీలో ప్రమాదం
- ప్రమాదం జరిగినప్పుడు అధికార యంత్రాంగం విచారణ కమిటీ వేసి చేతులు దులిపేసుకుంటోందని విమర్శలు
- అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేస్తున్నారని ఆరోపణలు



వసంత్ కెమికల్స్ కంపెనీలో మంటలు చెలరేగుతున్న దృశ్యం, (ఇన్‌సెట్‌లో) కంపెనీ బోర్డు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు ఫార్మా కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు కొరవడ్డాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగుల భద్రతపై కంపెనీల యాజమాన్యాలు శ్రద్ధ చూపకపోవడంతో ప్రాణ నష్టం జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు జిల్లా యంత్రాంగం విచారణ కమిటీని ఏర్పాటు చేయడం, ఆ తరువాత కమిటీ బృందం ఇచ్చే నివేదిక వెలుగుచూడకపోవడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలోని అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్, పరవాడ మండలంలోని సెజ్‌లో 130కి పైగా ఫార్మా కంపెనీలు ఉన్నాయి. ఆయా కంపెనీల్లో వివిధ రాష్ట్రాల ఉద్యోగులు, కార్మికులు వేలాది మంది పని చేస్తున్నారు. అయితే పలు కంపెనీలు భద్రతా ప్రమాణాలను పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారు. కొన్ని ఫార్మా కంపెనీల్లో రసాయనాలు లీక్ అవడం, గ్యాస్ రిఫైనరీల నుంచి మంటలు ఎగిసి పడడం, రసాయనాలు నిల్వ చేసే ట్యాంకర్లు, రియాక్టర్లు పేలిపోవడం వంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఆ సమయంలో వున్న ఉద్యోగులు, కార్మికులు అనేక మంది ప్రమాదాల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతున్నారు. మరి కొందరు క్షతగాత్రులవుతున్నారు. చాలా కంపెనీల్లో ప్రమాదకరమైన కెమికల్స్ వినియోగిస్తుంటారు. అటువంటి కెమికల్స్ నిర్వహణ బాధ్యతలను తక్కువ ఖర్చుతో చేపట్టేందుకు పలు కంపెనీల యాజమాన్యాలు సబ్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. సబ్ కాంట్రాక్టర్లు కెమికల్స్ నిర్వహణ విషయంలో నైపుణ్యం కలిగిన ఉద్యోగులను నియమించుకోకపోవడం వల్ల తరచూ ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. నైపుణ్యం లేని ఉద్యోగుల నియామకాలు, రక్షణ చర్యల గురించి ఎవరైనా ప్రశ్నిస్తే యాజమాన్యాలు ఆ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగిస్తున్నారు. దీంతో కార్మికులు, ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

ఆగని ప్రమాదాలు

అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి మండలాల్లో ఫార్మా కంపెనీల్లో గత పదేళ్ల కాలంలో చిన్నా, పెద్ద కలిపి 45కు పైగా ప్రమాదాలు జరిగాయి. ఇప్పటి వరకు 40 మందికి పైగా వేర్వేరు ప్రమాదాల్లో కార్మికులు, ఉద్యోగులు మృతి చెందారు. 120 మందికిపైగా క్షతగాత్రులుగా మారారు. పరవాడ మండలంలో రెండేళ్ల కిందట ఒక ప్రముఖ ఫార్మా కంపెనీలో భారీ అగ్నిప్రమాదం జరిగి ఐదుగురు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. పలువురు క్షతగాత్రులయ్యారు. ఏడాది కిందట అచ్యుతాపురం ఈఎస్‌ఈజెడ్‌లో జీఎంఎఫ్‌సీ ల్యాబ్స్‌లో రియాక్టరు పేలిన ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయాల పాలయ్యారు. పరవాడ ఫార్మాసిటీలో సాయినాథ్ కెమికల్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు, స్మైలెక్స్ కంపెనీలో సంభవించిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు అప్పట్లో మృతి చెందిన సంగతి తెలిసిందే. అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో సీడ్స్ విభాగంలో 2022 జూన్ 3న, ఆగస్టు 2న విషవాయువు లీకై అనేకమంది మహిళా ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. గత ఏడాది జూన్ నెలలో రాంబిల్లి మండలంలో సాహితీ ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. నలుగురు గాయాలపాలయ్యారు. అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్, పరవాడ, రాంబిల్లి మండలాల్లో పలు ఫార్మా కంపెనీల్లో తరచూ జరుగుతున్న ప్రమాద ఘటనలు మరువక ముందే తాజాగా అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో రాంబిల్లి మండల పరిధిలో వున్న వసంత్ కెమికల్స్ కంపెనీలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో ఒడిశాకు చెందిన ప్రదీప్ రౌత్(44) అనే కార్మికుడు మృతి చెందాడు. కంపెనీలో రియాక్టరు వద్ద సేఫ్టీ రివ్యూ వాల్వ్ లీకు కారణంగా మంటలు ఎగిసిపడడంతో కార్మికులు, ఉద్యోగులు ... మిగతా 8వ పేజీలో

వసంత్ కెమికల్స్ ప్రమాదంపై విచారణకు కమిటీ ఏర్పాటు

- ఏడు రోజుల్లో నివేదికకు కలెక్టర్ ఆదేశం
- మృతుని కుటుంబానికి రూ.35 లక్షల ఎక్స్‌గ్రేషియా

అనకాపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో వసంత్ కెమికల్స్ పరిశ్రమ బ్లాక్ -6లో బుధవారం జరిగిన ప్రమాదంపై కలెక్టర్ విజయకృష్ణన్ విచారణ కమిటీని నియమించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, వీఎస్‌ఈజెడ్ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్‌తో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ప్రమాద కారణాలపై విచారణ చేపట్టి ఏడు రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిటీని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. పరిశ్రమ ప్రమాదంలో మృతిచెందిన ఒడిశాకు చెందిన ప్రదీప్ రౌతు కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో రూ.35 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వసంత్ కెమికల్స్‌లో అగ్నిప్రమాదం

- కార్మికుడు మృతి

- వార్త మెయిన్ ఎడిషన్‌లో..

గంజాయిపై ఉక్కుపాదం

రవాణాను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు

- అన్ని పోలీస్ స్టేషన్లలో ఫ్రంట్ ఆఫీసుల ఏర్పాటుకు కృషి
- ఎస్పీ ఎం.దీపిక



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎం.దీపిక

అనకాపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, రవాణాను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఆమె బుధవారం అనకాపల్లి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీ (అడ్మిన్) విజయ్‌భాస్కర్ నేతృత్వంలో ఎస్పీకి సిబ్బంది పూలబొకేలు అందించి సాదరంగా స్వాగతం పలికారు. ఉదయం 11.15 గంటలకు ఆమె చాంబర్‌లోకి అడుగుపెట్టి బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు, ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలను అదుపు చేసేందుకు కృషి చేస్తానన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానన్నారు. పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చేవారిని సాదరంగా స్వాగతించి, వారి సమస్యలు విని, ఫిర్యాదులు స్వీకరించే విధంగా జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లలో ఫ్రంట్ ఆఫీసులు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా కానిస్టేబుళ్లను ఫ్రంట్ ఆఫీసుల్లో అందుబాటులో ఉంచి ఫిర్యాదుల స్వీకరణకు చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లా ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో నేరాల అదుపునకు పోలీసులు, మీడియా సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా డీఎస్పీలు ఎస్.అప్పలరాజు(అనకాపల్లి), కేవీ సత్యనారాయణ (పరవాడ), ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయ సిబ్బంది ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.



విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టిని బుధవారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేస్తున్న జిల్లా ఎస్పీ దీపిక

నేరాల నియంత్రణకు టెక్నాలజీ వినియోగం

విధి నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా పోలీసులను తీర్చిదిద్దుతాం

- స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా చేయడమే ప్రథమ కర్తవ్యం
- గంజాయి సాగు, రవాణాను కట్టడి చేస్తాం
- విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐజీ గోపినాథ్ జట్టి

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటానని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి అన్నారు. డీఐజీగా బుధవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో గోపీనాథ్ మాట్లాడుతూ గతానికి భిన్నంగా ప్రస్తుతం అన్ని రంగాలకు అనుగుణంగా టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని పేర్కొంటూ, పోలీసులు తమ విధి నిర్వహణలో సాంకేతికతను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతామన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఎక్కువగా చదువుకున్నవారే నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారన్నారు. సైబర్ నేరాలు, ఇతర నేరాల అదుపునకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకునేలా నిపుణులతో పోలీసులకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. అవసరమైన మౌలిక వసతులు సమకూర్చుకుంటామన్నారు. సోషల్ మీడియా వినియోగంలో ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుని ప్రాథమిక పోలీసింగ్ అమలు జరిగే విధంగా కృషిచేస్తానని గోపీనాథ్ జట్టి అన్నారు. పోలీస్ స్టేషన్ స్థాయిలోనే అందరికీ న్యాయం జరిగేలా చేయడమే ప్రథమ కర్తవ్యమని తెలిపారు. కేంద్రం అమలుచేసే కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నేరాల నియంత్రణకు 2014లో రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతిలో కమాండ్ కంట్రోల్ ఏర్పాటుచేశామన్నారు. తిరుపతి ఎస్పీగా ఉన్నప్పుడు మహిళలు, బాలికలపై దాడులు, వేధింపుల నివారణకు 'షీ' టీమ్స్ ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని డీఐజీ వెల్లడించారు. గంజాయి నిర్మూలనకు తగు చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా పొరుగునున్న ఒడిశా పోలీసులతో కలిసి ప్రణాళిక అమలు చేస్తామన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. గంజాయి సాగును నిరోధించేందుకు అన్నిరకాల సాయం అందించనున్నదని పేర్కొన్నారు. గతంలో మూడున్నరేళ్లు విశాఖ జిల్లాలో పనిచేయడంతో ఏజెన్సీలోని అన్ని ప్రాంతాలపై అవగాహన ఉందని...గంజాయి సాగు, రవాణా నియంత్రణపై కఠినంగా ఉంటామన్నారు. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలు అణిచివేతకు పలు విభాగాలు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున కూంబింగ్, దాడులు చేసిన మాదిరిగా...ఇప్పుడు గంజాయి నిర్మూలనకు విభాగాలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని గోపినాథ్ జట్టి తెలిపారు. కాగా బాధ్యతలు స్వీకరించిన డీఐజీని సిటీ జాయింట్ సీపీ ఫకీరప్ప, అనకాపల్లి ఎస్పీ దీపికా పాటిల్, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

విశాఖ నుంచి ఉద్యోగ జీవితం ప్రారంభం

2008 బ్యాచ్‌కు చెందిన గోపినాథ్ జట్టి ఐపీఎస్ శిక్షణ పూర్తిచేసుకున్న తరువాత 2010లో విశాఖ జిల్లాలో ట్రైనీగా చేరారు. శిక్షణ తరువాత విశాఖలోనే గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండెంట్‌గా, తరువాత చింతపల్లి ఏఎస్పీగా పనిచేశారు. మొత్తం మూడున్నరేళ్లు విశాఖ జిల్లాలో పనిచేసి, 2013లో గుంటూరు ఏఎస్పీగా బదిలీపై వెళ్లి...అక్కడే ఎస్పీగా పదోన్నతి పొందారు. రాష్ట్ర విభజన అనంతరం తిరుపతి ఎస్పీగా, ఆ తరువాత మంగళగిరిలో ఆరో బెటాలియన్ కమాండెంట్‌గా, కర్నూలు ఎస్పీగా పనిచేసి 2018లో టీటీడీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులై మూడున్నరేళ్లు పనిచేశారు. 2022లో పదోన్నతి రావడంతో గ్రేహౌండ్స్ డీఐజీగా పోస్టింగ్ పొందారు.

మళ్లీ టోల్‌గేట్

అగనంపూడిలో తొలగించిన టోల్‌గేట్‌ను పునరుద్ధరించేందుకు సిద్ధమవుతున్న నేషనల్ హైవే అథారిటీ

- టోల్ వసూళ్లకు టెండర్లు ఆహ్వానం
- ఏడాదికి రూ.81 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా
- స్థానికుల ఆగ్రహం



స్థానికులు, కూటమి కార్యకర్తలు టోల్‌ప్లాజాను తొలగించడంతో ప్రస్తుతం ఇలా..

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి వద్ద టోల్‌గేట్‌ను మళ్లీ ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ టోల్‌గేట్‌ను తొలగించాలంటూ కొద్దిరోజుల కిందట స్థానికులు, కూటమి కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మరుసటిరోజు రాత్రి టోల్‌ప్లాజాను పూర్తిగా తొలగించారు. అప్పటి నుంచి అక్కడ టోల్‌గేట్ లేదు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఈ వ్యవహారంపై నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు కూడా చేశారు. కానీ, సున్నితమైన వ్యవహారం కావడంతో పోలీసులు కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయారు. దీంతో టోల్‌గేట్ బెడద తొలగిపోయిందంటూ స్థానికులు ఆనందం వ్యక్తంచేశారు. అయితే ఈ టోల్‌గేట్‌ను మళ్లీ పెట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. టోల్ వసూలుకు టెండర్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ నెల పదో తేదీన కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల సంస్థ పరిధిలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం అగనంపూడి టోల్‌గేట్ ద్వారా ఏడాదికి రూ.81 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసిన ఎన్‌హెచ్‌ఏఐ..అందుకు అనుగుణంగా టెండర్లను ఆహ్వానించింది. అక్కడ వసూలుచేసే ఫీజులకు సంబంధించిన వివరాలను టెండర్ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. కారు, జీపు, వ్యాన్, లైట్ మోటార్ వెహికల్‌కు వన్ వే ట్రిప్‌నకు రూ.65, రెండు వైపులా అయితే రూ.95, ఈ వాహనాలు నెలలో 50 సార్లు ప్రయాణించేందుకు రూ.2,155, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన కమర్షియల్ వాహనాలకు రూ.30 చొప్పున నిర్ణయించారు. అలాగే, లైట్ కమర్షియల్ వెహికల్, లైట్ గూడ్స్ వెహికల్, మినీ బస్సులకు ఒక ట్రిప్‌నకు రూ.105, రెండువైపులా అయితే రూ.155, నెలకు 50సార్లు ప్రయాణించేందుకు రూ.3,485, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన వాహనాలకు రూ.50 ఫీజుగా నిర్ణయించారు. అదేవిధంగా బస్సు, ట్రక్ వంటి వాహనాలు ఒక ట్రిప్‌నకు రూ.220, రిటర్న్ ట్రిప్‌నకు రూ.330, నెలకు 50సార్లు తిరిగేందుకు రూ.7,300, జిల్లా పరిధిలోని రిజిస్టర్ అయిన వాటికి రూ.110గా, కమర్షియల్ వాహనాలు (మూడు చక్రాలు) ఒక ట్రిప్‌నకు రూ.240, రిటర్న్ ట్రిప్‌కు రూ.360, నెలకు 50సార్లు ప్రయాణాలు సాగించేందుకు రూ.7,965, జిల్లా స్థాయిలో రిజిస్టర్ అయిన వాటికి రూ.120 చొప్పున వసూలు చేయనున్నారు. హెవీ కనస్ట్రక్షన్ మెషీన్లతో కూడిన వాహనాలతోపాటు ఇతర వాహనాలకు కొన్నిరకాల చార్జీలను నిర్ధారించి వసూలు చేసేలా టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. టెండర్లు వేసేందుకు ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలు తుదిగడువుగా పేర్కొంది. ఈ నెల 25వ తేదీ ఉదయం 11.30 గంటలకు టెండర్లు తెరవనున్నారు.

సీఎం దృష్టికి తీసుకువెళ్లిన నేషనల్ హైవే అధికారులు

అగనంపూడి టోల్‌గేట్ వ్యవహారాన్ని నేషనల్ హైవే అథారిటీ అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ టోల్‌గేట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని రానున్న కాలంలో ఫ్లై ఓవర్లు, బస్, లారీ బేల నిర్మాణం, రోడ్డు మరమ్మతులు, నిర్వహణకు వినియోగిస్తామని చెప్పినట్టు తెలిసింది. అయితే, ఈ విషయంపై సీఎం ఎలా స్పందించారన్నది తెలియాల్సి ఉంది. ఇదిలావుండగా టోల్‌గేట్‌కు అధికారులు టెండర్లు ఆహ్వానించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై మళ్లీ పోరాటం చేసేందుకు సిద్ధమని పేర్కొంటున్నారు.

దీనిపై స్థానిక ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఈ ప్రకటన చేయడం దారుణమన్నారు. ఇక్కడ టోల్‌గేట్ ఏర్పాటుచేస్తే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుందన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని టోల్‌గేట్ ఏర్పాటుపై అధికారులు పునరాలోచన చేయాలన్నారు. ఎన్‌హెచ్16కు బదులు ఎన్‌హెచ్ 5 అంటూ పేర్కొనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.



ఆలయం బయట క్యూలైన్‌లో భక్తులు

ఉపమాక క్షేత్రం కిటకిట

- తొలి ఏకాదశి సందర్భంగా పోటెత్తిన భక్తులు

నక్కపల్లి, జూలై 17: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయంలో స్వామివారికి ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు ప్రత్యేక పూజలు చేసి, స్వామివారికి హారతులిచ్చారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న ప్రధానార్చకులు

వరి ఆకుమడులకు తెగుళ్ల బెడద

- రైతుల్లో ఆందోళన

- వార్త 7వ పేజీలో..

క్రైం... crime news

రైలు ఢీకొని టైల్స్ మేస్త్రి మృతి


కర్రి దుర్గ (ఫైల్)

ఎస్.రాయవరం, జూలై 17: మండలంలోని భీమవరం గ్రామ సమీపంలో రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇందుకు సంబంధించి తుని రైల్వే ఎస్ఐ ఎస్కే అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాలివి. గెడ్డపాలెం గ్రామానికి చెందిన కర్రి దుర్గ (40) టైల్స్ మేస్త్రిగా పనిచేసేవారు. బుధవారం ఉదయం పని నిమిత్తం వెళుతూ భీమవరం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతున్నాడు. ఇంతలో విశాఖ నుంచి తుని వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతుడు దుర్గకు భార్యతో పాటు వర్షిత్ అనే తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇతడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట, జూలై 17: ఇక్కడి బయ్యవరం- నర్సింగబిల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని తుని రైల్వే పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్ల ఉంటాయని, సిమెంటు రంగు షార్టు, నీలం రంగు టీ షర్టు ధరించి ఉన్నాడని వాటిపై సిమెంటు అని ముద్రించి ఉందని వివరించారు. ఇంతకు మించి ఎటువంటి వివరాలు లభించలేదన్నారు. కాగా ఏదో రైలు బండి ఢీకొని ఉంటుందని, అందువల్లే శరీర భాగాలన్నీ నుజ్జునుజ్జై ఉన్నాయని ఆయన వివరించారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. కుటుంబ సభ్యులు తమను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

లారీ ఢీకొని రైతు మృతి

అనకాపల్లి టౌన్, జూలై 17: ఇక్కడి జాతీయ రహదారిలోని ఉమ్మలాడ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్ర గాయాలకు గురయ్యాడు. విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ సీఐ పి.షైడపునాయుడు తెలిపిన వివరాలివి. మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామానికి చెందిన ఆడారి పరదేశినాయుడు (71) అనే రైతు ఉమ్మలాడ జంక్షన్ వద్ద బుధవారం రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో విశాఖ నుంచి తుని వైపు వెళుతున్న లారీ ఢీకొనడంతో అతని రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ పరదేశినాయుడు సాయంత్రం మృతి చెందినట్టు సీఐ చెప్పారు. మృతుడి కుమారుడు జగదీశ్వరరావు ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఏఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

నర్సీపట్నం, జూలై 17: కడుపు నొప్పి భరించ లేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడలో నివాసం ఉంటున్న తుంపాల ఈశ్వరరావు సోమవారం వెంకునాయుడుపేటలో ఉంటున్న తమ్ముడు శ్రీను ఇంటికి వచ్చాడు. మంగళవారం కడుపునొప్పిగా ఉందంటూ సోదరుడితో చెప్పాడు. ఆస్పత్రికి తీసుకు వెళ్లే లోగా కడుపు నొప్పి భరించ లేక విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతిడి తమ్ముడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

12 మంది పేకాటరాయుళ్లపై కేసు

- రూ.18,340 స్వాధీనం

బుచ్చెయ్యపేట, జూలై 17: వడ్డాదిలో పేకాట శిబిరంపై బుధవారం బుచ్చెయ్యపేట పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాటాడుతున్న 12 మందిపై కేసు నమోదు చేసి, 18 వేల 340లతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

కండక్టర్‌పై ఇంటర్ విద్యార్థి దాడి

నర్సీపట్నం, జూలై 17: ఆర్టీసీ కండక్టర్‌పై ఇంటర్ విద్యార్థి దాడి చేసిన ఉదంతంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఉమామహేశ్వరరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణాదేవిపేటకు చెందిన కోగాడ చిట్టిబాబు నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. మంగళవారం స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థి స్వగ్రామం మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం వెళ్లడానికి నర్సీపట్నంలో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. టిక్కెట్టు ఇచ్చేటప్పుడు కండక్టర్ చిల్లర అడిగారు. దీంతో విద్యార్థి మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో విద్యార్థి.. కండక్టర్ విధులకు భంగం కలిగించి దాడి చేసి కొట్టాడు. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పట్టపగలు అంతా చూస్తుండగా.. సెల్‌ఫోన్ చోరీ

ఎలమంచిలి, జూలై 17 : పట్టణంలో బుధవారం మధ్యాహ్నం ప్రధాన రోడ్డుపై అందరూ చూస్తుండగానే సినీ ఫక్కీలో సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోవడం కలవరానికి గురిచేసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఎలమంచిలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బి.లక్ష్మణరావు ఎస్‌బీఐ సమీపంలోని ప్రధాన రోడ్డుపై ఉన్నారు. ఇంతలో ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి వాహనం పడిపోతున్నట్టు సీన్ క్రియేట్ చేశాడు. ఇది చూసిన సదరు రిటైర్డు ఉపాధ్యాయుడు వాహనంపై నుంచి అతడు పడిపోకుండా సహాయం చేస్తున్న సమయంలో వెనుకనుంచి మరో యువకుడు వచ్చాడు. రిటైర్డు ఉపాధ్యాయుడి చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నాడు. అనంతరం ఆ ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ తరహా సంఘటనలు పట్టణంలో పరిపాటిగా మారడంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇటువంటి వారి ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

గేదెపై శునకం సవారీ...


గేదెపై కూర్చొని స్వారీ చేస్తున్న శునకం

గుర్రంపై మనుషులు స్వారీ చేయడం సర్వసాధారణం.. గేదెపై ఓ శునకం స్వారీ చేయడమే సంభ్రమాశ్చర్యం! చదవడానికి విడ్డూరంగా ఉన్నా, పై చిత్రాలను చూస్తూ 'అబ్బో ఇది నిజమే' అనిపిస్తుంది. ఇక్కడితో సీన్ అయిపోలేదండోయ్..! స్వారీ చేయడానికి ముందు రోడ్డుపై వెళ్తున్న గేదెపైకి సదరు శునకం జంప్ చేసి మరీ కూర్చోవడం, దాదాపు కిలోమీటరు దూరం దాన్ని కిందకు పడేసే పని చేకుండా గేదె నిదానంగా ముందుకు సాగడం విశేషం. చింతపల్లి సబ్ జైలు నుంచి సంతబయలు వరకు రహదారిపై తారసపడ్డ ఈ చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా ఇలా క్లిక్‌మనిపించింది. - చింతపల్లి

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

వరి ఆకుమడులకు తెగుళ్లు

- రైతుల్లో ఆందోళన


వరినారు మడులకు రసాయనిక మందు పిచికారి చేస్తున్న రైతు


బంగారుమెట్టలో బూజు తెగులుతో దెబ్బతిన్న వరి నారు

బుచ్చెయ్యపేట, జూలై 17: మండలంలో వరి ఆకుమడులకు తెగులు సోకుతోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మండలంలో 6500 ఎకరాల్లో వరిసాగుకు రైతులు వరి ఆకులు పోశారు. వడ్డాది, మంగళాపురం, విజయరామరాజుపేట, లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీపీ అగ్రహారం, పొట్టిదొరపాలెం, రాజాం, నీలకంఠాపురం, బుచ్చెయ్యపేట, చినఅప్పన్నపాలెం, పొలేపల్లి, దిబ్బిడి, పి.భీమవరం, కోమళ్లపూడి, గంటికొర్లాం, కొండెంపూడి, గున్నెంపూడి, పెదమదీన, కేపీ అగ్రహారం తదితర గ్రామాల్లో వరి ఆకుకు పోడ, మొవ్వుకుళ్ళు, అగ్గి, బూజు తెగులు సోకడంతో వరి ఆకు దెబ్బతింది. రోజురోజుకూ తెగులు ఎక్కువ కావడంతో రైతులు రసాయనిక మందులు పిచ్చికారీ చేస్తున్నారు.

ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి వాతావరణంలో మార్పులతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూన్ మూడో వారం వరకు మురిపించిన వర్షాలు మొహం చాటేయడంతో వర్షాధారంపై ఆధారపడి వరి సాగు చేస్తున్న ఎర్రవాయి ప్రాంత రైతులు అధిక వ్యయ, ప్రయాసాలకు ఓర్చి ఆకుమడులు తడులు అందించారు. ఇప్పుడు నారుమడులకు తెగులు సోకడంతో రైతులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కాగా.. పొడ, బూజు తెగులు నివారణకు ఎగ్జాకాన్‌జోల్ లీటరు నీటికి 2 ఎంఎల్ మందు కలిపి పిచ్చికారి చేయాలని ఏవో భాస్కరరావు తెలిపారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ లీటరు నీటికి ఒక గ్రాము పొడరు కలిపి పిచికారీ చేయాలు సూచించారు. మొవ్వు కుళ్లు తెగులు నివారణకు 30 కేజీల విత్తనాల బస్తాకు ఒక కేజీ 3 జి గుళికలు, లేదా క్లోరోపైరీపాస్ (20ఈసీ) లీటరు నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

సానుకూల దృక్పథంతో సమర్థంగా సేవలు

- బదిలీపై వెళుతున్న ఎస్పీ మురళీకృష్ణకు ఘన సత్కారం
- జిల్లాలో ఆయన అందించిన సేవలను కొనియాడిన అధికారులు
- అందరికీ కృతజ్ఞతలు తెలిపిన ఎస్పీ



మురళీకృష్ణ దంపతులను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

అనకాపల్లి టౌన్, జూలై 17 : అనకాపల్లి జిల్లా ఎస్పీగా పనిచేసి బదిలీపై అనంతపురం వెళుతున్న కేవీ మురళీకృష్ణ దంపతులను ఇక్కడ ఘనంగా సత్కరించారు. రింగురోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఆత్మీయ వీడ్కోలు సభలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ మాట్లాడుతూ శాంతిభద్రతలను పరిరక్షించే విషయంలో, ఎన్నికల విధుల సమయంలోనే కాకుండా, సమస్యాత్మక విషయాలకు సైతం ఎస్పీ మురళీకృష్ణ సున్నిత దృక్పథంతో చక్కని పరిష్కార మార్గాలను చూపేవారన్నారు. ఒక అధికారిగా ఆయనకు గొప్ప లక్షణమని పేర్కొన్నారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలు గతంలో అధికంగా ఉండేవని కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని నివారించామన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే మరణాలను కట్టడి చేసేందుకు రహదారులపై అవకాశం ఉన్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి వాహనాల వేగాలను తగ్గించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో జిల్లాలో చెదురుమదురు సంఘటనలు మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమర్థవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించగలిగామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతం ఎస్పీ దంపతులను, వారి తల్లిదండ్రులను జిల్లా పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ హెచ్‌వోడి డాక్టర్ శిల్పా, డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కేవీ సత్యనారాయణ, జీఆర్ఆర్ మోహన్, బి.అప్పారావు, ఎం.ఉపేంద్రబాబుతో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వసంత్ కెమికల్స్‌ను సందర్శించిన ఎమ్మెల్యే సుందరపు

- కంపెనీ ప్రతినిధులతో చర్చలు
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆదేశం


కంపెనీలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి కంపెనీ ప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, జూలై 17: మండలంలోని ఎస్ఈజడ్‌లో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగిన వసంత్ కెమికల్స్ కంపెనీని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను పరామర్శించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. కంపెనీలో మృతి చెందిన కుటుంబానికి పరిహారం అందించడంతో పాటు, కంపెనీ నుంచి వచ్చే ప్రయోజనాలను ఆ కుటుంబానికి అందించాలని స్పష్టం చేశారు. సెజ్‌లోని కంపెనీల్లో ఇలాంటి సంఘటలను పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాగా, మృతుడి కుటుంబీకులు ఒడిశా నుంచి రావాల్సి ఉందని, పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని ఆయన కుటుంబీకులకు అందజేయడం జరుతుందని రాంబిల్లి సీఐ నర్సింగరావు తెలిపారు.

ఎమ్మెల్యే వెంట టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడా నాగేశ్వరరావు, బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గం కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు, బీజేపీ నేత బీవీఎస్ వర్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు, పల్లి రాజాబాబు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు జేఎస్ రాజు, జనసేన పార్టీ అచ్యుతాపురం మండలశాఖ అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు, అచ్యుతాపురం మాజీ జడ్పీటీసీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

యానాద్రి కాలువకు మహర్దశ

పూడిక తీసి, అభివృద్ధి చేయాలని దీర్ఘకాలంగా వేడుకున్నా పట్టని అధికారులు

- వివిధ రూపాల్లో ఆందోళనలు చేసిన పట్టణవాసులు
- ఓవైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో ఇబ్బందులు
- ఎట్టకేలకు స్పందించడంతో అంతా ఆనందం


కొత్తపేట వద్ద పూడిక తీసి, కాలువ అభివృద్ధి చేసిన దృశ్యం

ఎలమంచిలి, జూలై 17: దశాబ్ద కాలం తరువాత పట్టణంలో ఉన్న యానాద్రి కాలువలో పూర్తిస్థాయిలో పూడిక తీత పనులు చేపడుతున్నారు. కొత్తపేట ప్రాంతంలో ఈ కాలువ సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. ఇందులో పూడిక పేరుకుపోవడంతో ఎక్కడికక్కడ చెత్తాచెదారం నిలిచిపోయేది. దీంతో మురుగు ముందుకు పారలేని పరిస్థితి నెలకొనేది. ఈ సమస్యను పరిష్కరించాలని ఎలమంచిలి వాసులు పలుమార్లు అధికారులకు విన్నవించినా, వివిధ రూపాల్లో


పనులను పరిశీలించేందుకు వచ్చిన మునిసిపల్ పాలకవర్గం

ఆందోళనలు చేట్టినా పటించుకునేవారు కరువయ్యారు. దీంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో ఆయా ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఎట్టకేలకు మునిసిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు ఈ సమస్యపై దృష్టి సారించారు. తొలుత కొత్తపేట వార్డు వద్ద కాలువలో పూడిక తొలగించడంతో అక్కడి వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, పాలకవర్గ సభ్యులు, అధికారులు పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మరికొద్ది రోజుల్లో పనులు పూర్తికానున్నాయని డీఈ వీరయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావులు తెలిపారు.

విద్యుత్ బకాయిలు రూ.319.77 కోట్లు

- ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్‌లో ప్రభుత్వ సంస్థల నుంచి రావలసింది రూ.124.03 కోట్లు
- మైనర్‌పంచాయతీల నుంచి రూ.170.76 కోట్లు
- జీవీఎంసీ బకాయి రూ.22.96 కోట్లు
- మునిసిపాలిటీలు రూ.2.03 కోట్లు
- విశాఖ కలెక్టరేట్ రూ.8.18 కోట్లు
- రోడ్లు, భవనాల శాఖ రూ.6.17 కోట్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లోనివిశాఖపట్నం సర్కిల్‌కు వివిధ ప్రభుత్వ, స్థానిక పరిపాలన సంస్థల నుంచిరావలసిన బకాయిలు పెరిగిపోతున్నాయి. జూన్ నెలాఖరు నాటికి విశాఖసర్కిల్‌లో రూ. 319.77 కోట్లు రావలసి ఉంది. ఈ సర్కిల్‌లో అనకాపల్లి, కశింకోట, నర్సీపట్నం, పాడేరు డివిజన్లు గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి.

జోన్-1, జోన్ 2, జోన్-3 డివిజన్లు విశాకపట్నం నగరంలో ఉన్నాయి. ప్రైవేటు అంటే గృహ, ప్రైవేటు పారిశ్రామిక సంస్థల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలోనే వసూలు అవుతున్నాయి. దాదాపుగా 90 శాతం కలెక్షన్ ఉంటోంది. ఎవరైనా బకాయి ఉంటే వారికి విద్యుత్ కనెక్షన్ తీసేస్తుండడంతో వెంటనే బకాయి చెల్లించి సరఫరా పునరుద్ధరించుకుంటున్నారు. అదే ప్రభుత్వ సంస్థల విషయానికి వచ్చేసరికి అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయలేక పోతున్నారు. నోటీసులు మీద నోటీసులు ఇవ్వడం తప్పితే అటు నుంచి పెద్దగా స్పందన ఉండడం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని, అందుకే బిల్లులు చెల్లించలేకపోతున్నామని సదరు ప్రభుత్వ విభాగాల అధిపతులు చెబుతున్నారు. అదేవిధంగా జీవీఎంసీ, మునిసిపాలిటీలు, పంచాయతీలు కూడా విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. ఎంత ఆలస్యమైనా ఈపీడీసీఎల్ అధికారులు వేచిచూడడం తప్పితే సరఫరా నిలిపివేయలేరనే ధీమా వల్ల స్థానిక సంస్థలు తీరుబడిగా, మిగులు నిధులు ఉన్నప్పుడు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాయి. జూన్ నెలాఖరు నాటికి ప్రభుత్వ సంస్థల నుంచి రూ.124.03 కోట్లు, మైనర్ పంచాయతీల నుంచి రూ.170.76 కోట్లు, జీవీఎంసీ నుంచి రూ.22.96 కోట్లు, మునిసిపాలిటీల నుంచి రూ.2.03 కోట్లు బకాయిలు రావలసి ఉంది. డివిజన్ల వారీగా చూసుకుంటే అనకాపల్లి డివిజన్ నుంచి రూ.29.31 కోట్లు, కశింకోట డివిజన్ నుంచి రూ.91.72 కోట్లు, నర్సీపట్నం నుంచి రూ.39.63 కోట్లు, పాడేరు నుంచి రూ.79.66 కోట్లు బకాయిలు రావలసి ఉంది. విశాఖ నగరంలో చూసుకుంటే జోన్-1 డివిజన్ నుంచి రూ.31.56 కోట్లు, జోన్-2 నుంచి 9.50 కోట్లు, జోన్-3 నుంచి రూ.38.39 కోట్లు వసూలు కావలసి ఉంది.

ఒక్క జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే రూ.8.18 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఐటీ శాఖ నుంచి రూ.2.42 కోట్లు, పరిశ్రమల శాఖ నుంచి రూ.3.32 కోట్లు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ నుంచి రూ.6.17 కోట్లు, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రూ.21.4 కోట్ల బిల్లులు వసూలు కావలసి ఉంది. అందరికీ నోటీసులు ఇచ్చామని, ఎంతో కొంత చెల్లించాలని కోరామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేంద్రనాథ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

శ్రీరంగనాథుడి అవతారంలో జగన్నాథుడు


శ్రీరంగనాథుడి అవతారంలో జగన్నాథుడు

చోడవరం, జూలై 17: జగన్నాథుడి రథోత్సవాల సందర్భంగా దశరూపమహోత్సవాల్లో భాగంగా బుధవారం జగన్నాథస్వామి భక్తులకు శ్రీరంగనాథుడి అవతారంలో దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణి బాబు, ఉప్పల బాబు, ఉపాధ్యాయుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలతో సీతారాముల అలంకరణ


దుగ్గాడలోని రామాలయంలో కూరగాయలతో అలంకరించిన సీతారాములు

నర్సీపట్నం అర్బన్, జూలై 17: మండలంలోని దుగ్గాడ రామాలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు కూరగాయలతో అలంకరించిన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిద్ర లలిత, నాయకులు శ్రీనివాసరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా దుర్గాదేవి



స్థానిక దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా శాకాంబరి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం దుర్గాదేవిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. శాకాంబరి అవతారం ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- నర్సీపట్నం

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

- భక్తులతో వడ్డాది గిరిజాంబగిరి కిటకిట


వడ్డాదిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట, జూలై 17: మండలంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని మంగళ వారం ఘనంగా జరుపుకున్నారు. వడ్డాదిలో గిరిజాంబగిరిపై కొలువైయున్న స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారిని అర్చకులు పలు రకాలు పుష్పాలతో అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా పలువురు భక్తులు ఉపవాస దీక్ష ఆచరించారు.

వ్యర్థ రసాయనాల ట్యాంకర్‌పై విచారణ జరపాలి

- గుట్టుగా సముద్రంలోకి విడిచి పెడుతుండడం దారుణం
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు 'గనిశెట్టి'

పరవాడ, జూలై 17 : పెదగంట్యాడ మండలం గంగవరం బ్రిడ్జి వద్ద వ్యర్థ రసాయనాల లోడుతో సోమవారం రాత్రి పట్టుబడ్డ ట్యాంకర్ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ బుధవారం ఇక్కడ డిమాండ్ చేశారు. భారీగా వ్యర్థ రసాయనాలను గుట్టు చప్పుడు కాకుండా ట్యాంకర్ ద్వారా సముద్రంలోకి విడిచి పెట్టడం దారుణమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో తక్షణమే ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రమాదకరమైన వ్యర్థ జలాలను బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ట్యాంకర్ యాజమానితో పాటు వ్యర్థాలతో సంబంధమున్న ఫార్మాసిటీ యాజమాన్యాన్ని కూడా అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరిపించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తరహా సంఘటనలు జరగకుండా జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రెండు కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

పాయకరావుపేట రూరల్, జూలై 17 : నామవరంలో బుధవారం గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పాయకరావుపేట పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని నామవరంలో గల వైభవ్ టౌన్ షిప్ ఆర్చ్ వద్ద తమ సిబ్బంది బుధవారం మాటు వేశామన్నారు. మోటారు సైకిల్‌పై వచ్చిన నక్కపల్లి మండలం చినరామభద్రపురం గ్రామానికి చెందిన వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా, సుమారు రెండు కిలోల గంజాయి కవర్‌లో ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. ఇతడు కొంత మంది వ్యక్తులతో కలిసి గంజాయిని కొనుగోలుచేసి, వందగ్రాముల చొప్పున చిన్న చిన్న ప్యాకెట్లుచేసి విక్రయిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. నిందుతుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు చెప్పారు.

రిటైర్‌మెంట్ వయస్సు

62 ఏళ్లకు పెంచాలి

▸▸ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

అనకాపల్లి టౌన్, జూలై 17 : విద్యుత్ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ రీజియన్ కార్యవర్గ సమావేశం బుధవారం సాయంత్రం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ 1999 తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులకు 62 ఏళ్లకు పెంచితే మేలు జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో కారుణ్య నియామకాల ద్వారా ఇచ్చిన ఉద్యోగులందరికీ నేరుగా రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు ఇచ్చేవారని, ప్రస్తుతం విద్యుత్ సంస్థలో కారుణ్య నియామకాల ద్వారా వచ్చే ఉద్యోగులకు కొత్త పేర్లు పెట్టి రెండేళ్ల శిక్షణ పేరుతో రూ.15వేలు, రూ. 18,500లు వేతనం నిర్ణయించి వేతనం ఇస్తున్నారని వాపోయారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవోను వెంటనే రద్దు చేసి కారుణ్య నియామకాల ద్వారా విధుల్లో చేరే ఉద్యోగులకు రెగ్యులర్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రీజనల్ అధ్యక్షుడు ప్రేమ చంద్రశేఖర్, కార్యదర్శి సత్యారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, ఎం.జాని, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

ఆక్వా రంగంలో భారత్ భేష్ : శ్రీలంక మంత్రి


మాట్లాడుతున్న మత్స్యశాఖ మంత్రి డగ్లస్

పాయకరావుపేట రూరల్, జూలై 17 : శ్రీలంకలో ఆక్వా రంగ అభివృద్ధి కోసం అధ్యయనం చేసేందుకు భారత్‌లోని ఆక్వారంగ పరిశ్రమలను సందర్శిస్తున్నట్టు శ్రీలంక మత్స్యశాఖా మంత్రి డగ్లస్ దేవానంద తెలిపారు. మండలంలోని పెంటకోటలో గల శిల్పా హేచరీని బుధవారం ఆయన తన బృందంతో కలిసి సందర్శించి, పలు విషయాలపై ఆరా తీశారు. ఆక్వా రంగంలో భారతదేశం అద్వాన్సుగా ఉందని కితాబునిచ్చారు.. శ్రీలంక జాతీయ ఆక్వాటిక్ రీసెర్చ్ ఏజెన్సీ డెరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అరుళానందం, డైరెక్టర్ నిరుప్‌రాజ్, నవీన్‌వర్మ, శ్రీనివాస్ వర్మ పాల్గొన్నారు.

'కర్మాగారాల్లో ప్రమాదాలను నియంత్రించాలి'


కర్మాగారం ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం, జూలై 17 : సెజ్‌లోని కర్మాగారాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. వసంత్ కెమికల్స్ వద్ద బుధవారం ప్రమాదం జరిగి ఒడిశాకు చెందిన కార్మికుడు మృతిచెందడంతో ఆయన కార్మికులతో జరిగిన ఆందోళనలో చేపట్టారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ కర్మాగారాల యాజమాన్యాలు లాభాపేక్ష చూసుకుంటున్నాయే తప్ప, కార్మికుల శ్రేయస్సు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. కర్మాగారాల్లో భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ముఖ్యంగా ఫార్మా కర్మాగారాల్లో రియాక్టర్లు పేలి మృతి చెందిన వారే అధికంగా ఉన్నారన్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని వాపోయారు.

రాంబిల్లి: వసంత కెమికల్స్‌లో బుధవారం రియాక్టర్ పేలిన సంఘటనలో మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి యాజమాన్యం రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఆర్.రాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ ముఖ ద్వారం వద్ద పలు కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

అనకాపల్లి టౌన్: అచ్యుతాపురం సెజ్‌లోని రాంబిల్లి వద్ద గల వసంత కెమికల్స్‌లో రియాక్టర్ పేలిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో జిల్లా అధికారులను కోరారు. కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన ప్రదీప్‌రౌత్ అనే కార్మికుడు మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించి, కంపెనీ యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

తుమ్మపాల : వసంత కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబుడిమాండ్ చేశారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి మృతదేహాన్ని బుధవారం ఎన్టీఆర్ వైద్యాలయంలో పరిశీలించారు. మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఫార్మా కంపెనీల్లో భద్రత కరువు

... 5వ పేజీ తరువాయి

భయాందోళనతో పరుగులు తీశారు.

మొక్కుబడి తనిఖీలు

ఫార్మా కంపెనీల్లో ఉద్యోగుల భద్రత, ప్రమాదాల నివారణకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారనే దానిపై విచారణ జరపాల్సిన అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక, అగ్నిమాపక శాఖల అధికారులు ఏడాదిలో కనీసం నాలుగు పర్యాయాలు తనిఖీలు చేసి పరిస్థితులను చక్కదిద్దే దిశగా కంపెనీల యాజమాన్యాలకు మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉన్నా ఆ విధంగా జరగడం లేదు. ఫార్మా కంపెనీల్లో కంట్రోల్ కాని రియాక్టర్లు ఉంటాయి. వాటిలో నిరంతరాయంగా హై టెంపరేచర్ ద్రవాలను మరిగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో నిపుణులైన ఉద్యోగులు, కార్మికులు ఆయా రియాక్టర్లు పనిచేసే విభాగాల్లో అధిక ఉష్ణోగ్రత కారణంగా రియాక్టర్లు పేలిపోకుండా, ఇతరత్రా అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా పర్యవేక్షించాల్సి వుంటుంది. కానీ ఫార్మా కంపెనీల్లో నిపుణులైన ఉద్యోగులు లేకపోవడం వల్లే తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లు పేలడం, పైపులైన్ లీకేజీల కారణంగా తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యర్థ రసాయనాలు ప్రవహించే పైపులైన్‌లు సక్రమంగా ఉన్నాయా?, లేదా? అనేది తరచూ పర్యవేక్షించాలి. వ్యర్థ రసాయనాలు శుద్ధి చేసిన తరువాతే బయటకు పంపాల్సి ఉన్నా ఆ విధమైన చర్యలు చేపట్టక పోవడం వల్ల ప్రమాదాలు జరగుతున్నాయని తెలుస్తోంది. అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో అత్యధిక శాతం మంది నిపుణులైన ఉద్యోగులు లేని కారణంగా తరచూ జరుగుతున్నా ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వైకుంఠ వాసా.. శ్రీవేంకటేశా..

▸▸ ఊరూరా.. ఘనంగా తొలి ఏకాదశి ▸▸ ఆలయాల్లో విశేష పూజలు

▸▸ ఎలమంచిలిలోని కొత్తపేటలో స్వామివారికి లక్ష పత్రితో అర్చనలు


అనకాపల్లి దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల పూజలు


ఎస్.రాయవరంలో పుష్పమాల అలంకరణలో వేంకటేశ్వరస్వామి


ఎలమంచిలిలో లక్ష పత్రి పూజ


'పేట'లో దర్శనమిస్తున్న పాండురంగస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 17 : పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు పులకండం విజయ్‌బాబు, పులకండం గిరిబాబు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో రాజసులోచన, పులకండం ప్రసాద్, రాజేష్‌బాబులతో పాటు సకల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : ఈ ఏడాది తొలి ఏకాదశి పర్వదినాన్ని మండల ప్రజలు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇక్కడి పాండురంగస్వామి ఆలయంలో ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి పాండురంగ స్వామి, ఆళ్వార్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, బృందావనంలోని దుర్గాలమ్మచెట్టు ఆలయంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అదేవిధంగా రాజుగారిబీడులోకి వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

ఎస్.రాయవరం : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. రామాలయాలతో పాటు ఎస్.రాయవరంలో ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి, దార్లపూడి షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. కొరుప్రోలు రామాలయంలో సీతారామస్వామి భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఏకాహం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : పట్టణంలోని కొత్తపేటలో గల పురాతన సీతారాముల ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష పత్రి పూజ జరిపారు. పెద్ద సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. అలాగే, ఎలమంచిలి వేంకటేశ్వర స్వామి ఆలయం, సోమలింగపాలెం, పెదపల్లి, కొక్కిరాపల్లి, యర్రవరం వార్డుల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మేజర్ పంచాయతీ ఏటికొప్పాక, పీఎస్‌ఆర్‌పేట, పులపర్తి, లైను కొత్తూరు గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

భక్తిశ్రద్ధలతో మొహరం వేడుక


'పేట'పెదపీర్ల పంజా వీధిలో అలంకరణలో పీర్లు


నక్కపల్లి మండలంలోని ఓ గ్రామంలో బావుటాల ఊరేగింపు


గొల్లగుంటలో అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్న ముస్లింలు

పాయకరావుపేట, జూలై 17 : మొహరం పర్వదినాన్ని బుధవారం పాయకరావుపేటలో ముస్లింలు, హిందువులు కలిసి అత్యంత ఘనంగా జరుపుకున్నారు. అస్సేన్, హుస్సేన్ సోదరులు వీరమరణం పొందిన రోజును పురస్కరించుకుని నిర్వహించే ఈ పండగ సందర్భంగా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పెదపీర్లు, చినపీర్లు పంజా వీధుల్లోని ముస్లింలు, హిందువులు కలిసి గత రెండు రోజులుగా ప్రత్యేక కార్యక్రమాలు, అగ్నిగుండాలు నిర్వహించారు. బుధవారం మొహరం సందర్భంగా పట్టణంలో బులాకి ఊరేగింపు భక్తి శ్రద్ధలతో జరిపారు.

నక్కపల్లి: మొహరంను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెదబోదిగల్లం, చినబోదిగల్లం, పెదదొడ్డిగల్లు, అప్పలపాయకరావుపేట తదితర గ్రామాల్లోని మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల్లో బావుటాలను ఎగురవేసి, ఊరేగింపు జరిపారు. మత పెద్దలు మొహరం విశిష్టతను వివరించారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్‌ను ముస్లిం మత పెద్దలు సన్మానించారు.

పరవాడ : మండల వ్యాప్తంగా బుధవారం మొహరంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామంలో ముస్లింలు పీర్లను గుర్తు చేసుకుంటూ పీర్ల కొట్టం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం పీర్లకు నైవేద్యం సమర్పించి ఫాతియా దువా పఠనంతో ముగించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

బాధిత మహిళకు నక్కపల్లి ఆస్పత్రిలో శస్త్రచికిత్స

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


ఆపరేషన్ చేసిసిన డాక్టర్ రవికిరణ్‌తో బాధిత మహిళ

నక్కపల్లి, జూలై 17 : ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మైనర్ ఆపరేషన్ కోసం వచ్చిన ఓ మహిళ వివరాలను సదరు యూనిట్ సిబ్బంది అప్‌లోడ్ చేయగా, ఆమె మరణించినట్టు రావడంతో వైద్య సిబ్బంది సహా బాధిత మహిళ కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. నక్కపల్లి ఆస్పత్రిలో వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి బుధవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై అధికారులు వెంటనే స్పందించారు. నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సాధిరెడ్డి లక్ష్మి అనే మహిళ చేతి వేలు దెబ్బతినడంతో ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు.కానీ ఆరోగ్యశ్రీ కోసం అప్‌లోడ్ చేయగా, ఆమె చనిపోయినట్టు సమాచారం వచ్చింది. ఈ విషయమై బాధిత కుటుంబసభ్యులు, స్థానికులు విస్మయానికి గురయ్యారు. ఇదిలావుంటే, బుధవారం ఉదయం నక్కపల్లి యాభై పడకల ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవి కిరణ్ బాధిత మహిళ లక్ష్మి చేతి వేలికి ఆపరేషన్ పూర్తి చేశారు. ఆమె ఆరోగ్యంగానే ఉన్నట్టు ఆయన తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు శుభపరిణామం : బుద్ద



తుమ్మపాల, జూలై 17 : గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జారీ చేసిన వివాదాస్పద ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశంలో రద్దు చేయడం శుభపరిణామం అని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగిపోయాయన్నారు. అలాగే, ఉచిత ఇసుక విధానానికి మార్గదర్శకాలు రూపొందించే వరకు గతంలో ఉన్న విధానం రద్దు చేసి మధ్యంతర వ్యవస్థను ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో నంబరు 43కు కేబినెట్ ఆమోద ముద్ర వేయడం హర్షణీయమన్నారు. జగన్‌రెడ్డి తీసుకువచ్చిన చీకటి జీవోలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేసూ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని ఆయన తెలిపారు. నెలరోజుల చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

'ఏఎంఏఎల్'లో సోలార్ ప్లాంటు ప్రారంభం

కొత్తూరు, జూలై 17 : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో సోలార్ ప్లాంటు బుధవారం ప్రారంభమైంది. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నాలుగు కిలోవాట్ల సామర్థ్యంతో రూ.3.5 లక్షలు వెచ్చించి దీనిని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు, కళాశాల పూర్వ విద్యార్థి కర్రి అప్పారావు ప్రారంభించారు. వ్యాపారవేత్త పెంటకోట సూరిబాబు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, సభ్యులు వాసిరెడ్డి బాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, పర్యవేక్షకులు పి.అనురాధ, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు అప్పారావు, కృష్ణంరాజు, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, నరసింహం పాల్గొన్నారు.

వేతన బకాయిల కోసం 'క్లాప్' కార్మికులు ఆందోళన


ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, జూలై 17 : వేతన బకాయిలు చెల్లించాలంటూ జీవీఎంసీ క్లాప్ వాహనాల షెడ్డు వద్ద కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. క్లాప్ వాహనాల లోడర్ల కార్మికులకు బకాయి పడిన మూడు నెలల వేతనాలను చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, సీఐ టీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. జోన్‌లో 27 మంది కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆయా కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేతనాల నుంచి కోత విధించిన పీఎఫ్, ఈఎస్ఐ నంబర్లు నేటి వరకు కాంట్రాక్టర్ ఇవ్వలేదని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వై.వరప్రసాద్, ఎస్.భారతి, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడ్ని దర్శించుకున్న ఎమ్మెల్యే 'గంటా'


జగన్నాథస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గంటా

కశింకోట, జూలై 17 : మండల కేంద్రం కశింకోట వేణుగోపాలస్వామి ఆలయంలో కల్కి అవతారంలో ఉన్న జగన్నాథస్వామిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు రేజేటి రామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, వేగి వెంకట్రావు, రేబాక మధు, తాకాశి కృష్ణ, కలగా సోమేశ్వరరావు, కాండ్రేగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చినదొడ్డిగల్లులో సత్తెమ్మతల్లి వేడుక



నక్కపల్లి, జూలై 17 : చిన దొడ్డిగల్లులో గురువారం సత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. గ్రామస్థులతో పాటు నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి, మొక్కులు చెల్లించుకోనున్నారు. ఎస్ఐ సన్నిబాబు నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

జగన్నాథుని హుండీ ఆదాయం రూ.13 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జూలై 17 : ఇక్కడి అగ్గిమర్రిచెట్టు వద్ద గల సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపు చేపట్టారు. స్వామి రథయాత్ర మహోత్సవంలో బాగంగా నవరాత్రి ఉత్సవాలకు భక్తులు మొక్కుబడులు, దర్శన టికెట్ల ద్వారా ఆలయానికి రూ.13 లక్షల ఒక వెయ్యి 385 ఆదాయం లభించినట్టు అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజ సులోచన, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సబ్బవరం, జూలై 17 : సబ్బవరం సెక్షన్-2 పరిధిలోని అంతకాపల్లి సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఇందుకు వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

హెచ్‌సీ కుటుంబానికి ఉద్యోగులు బాసట


మృతుని కుటుంబానికి నగదు అందిస్తున్న ఉద్యోగులు

కొత్తూరు, జూలై 17 : అనారోగ్యంతో మృతిచెందిన సహచర ఉద్యోగి కుటుంబానికి 1990 పోలీసు బ్యాచ్‌కు చెందిన ఉద్యోగులు బాసటగా నిలిచారు. కొత్తూరు సాయినగర్‌కు చెందిన నక్క అప్పారావు అనంతగిరి పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఈ నెల ఏడో తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. ఆ బ్యాచ్‌కు చెందిన ఉద్యోగులు శక్తి పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా బుధవారం రూ.లక్ష నగదును అందజేసి, సదరు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధ్యక్షుడు ఎస్.అనిల్, ఉపాధ్యక్షుడు జె.ఎస్.రాజు, ట్రెజరర్ ఎస్. ఎంకటేశ్వరరావు, కార్యదర్శి టి.ఎం.నాయుడు, ముబారక్, బోని శ్రీనివాసరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వెదురువాడలో మురుగు సమస్యకు మోక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చురుగ్గా కాలువ నిర్మాణ పనులు

అచ్యుతాపురం, జూలై 17: మండల కేంద్రం అచ్యుతాపురంలోని వెదురువాడలో మురుగు సమస్యకు మోక్షం లభించింది. ఇక్కడ అపార్టుమెంట్ల నుంచి విడుదలయ్యే వాడుకనీరు పారే విధంగా కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. వెదురువాడలో ఏర్పాటు చేసిన అపార్టుమెంట్లలో నివాసం ఉంటున్న వారు వినియోగించే నీరు పోయే మార్గం లేక రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఎక్కడికక్కడ నిలిచిపోయి మురుగుగా మారి దుర్వాసనతో పాటు దోమల బెడద అధికంగా ఉంది. ఈ సమస్యపై ఇటీవల "మురుగు కదలదు.. దుర్వాసన వదలదు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై వెంటనే స్పందించిన తహసీల్దార్ సరోజిని డ్రైనేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అచ్యుతాపురం-గాజువాక ప్రధాన రహదారిలో గల వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. కాలువ తవ్వడానికి ఎవ్వరూ ఆటంక పరచడానికి కుదరదని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షా కాలమని, మురుగు సమస్య తీరి అంతా ఆరోగ్యంగా ఉండాలని ఆమె అన్నారు. దీంతో మంగళవారం సాయంత్రం నుంచి పనులు ప్రారంభించారు. బుధవారం ఉదయం నుంచి ఎక్సకవేటర్ సహాయంతో కలువ తవ్వి తూరలు వేశారు. అపార్టుమెంట్ల నుంచి వచ్చే వాడుక నీటిని కాలువ ద్వారా ఇందిరమ్మ కాలనీలో ఉన్న ప్రధాన కాలువకు అనుసంధానం చేశారు. దీంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లైంది.

ధర్మిరెడ్డి నాన్నబాబుకు ఘన నివాళి


నాన్నబాబు చిత్రపటం వద్ద ఎమ్మెల్యే సుందరపు నివాళి

అచ్యుతాపురం, జూలై 17 : తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రామన్నపాలెం పంచాయతీ సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడుబాబు (డ్రీమ్స్ నాయుడు) తండ్రి నాన్నబాబు సంస్మరణ సభ బుధవారం రామన్నపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఎమ్మెల్యేలు సుందరపు విజయకుమార్, బండారు సత్యనారాయణ మూర్తి, ఎలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, సుందరపు సతీష్, నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, దొడ్డి శ్రీను, దిన్‌బాబు, నానాజీ, ఎంపీపీలు, బైలపూడి శ్రీరామదాసుతో పాటు కూటమి నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో పూర్వ విద్యార్థుల సందడి


ఎస్.రాయవరం సమీపం కొబ్బరితోటలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం, జూలై 17 : మండల కేంద్రం ఎస్.రాయవరం సమీపంలోని ఓ కొబ్బరి తోటలో పూర్వ విద్యార్థులు బుధవారం సందడి చేశారు. 1990-91 విద్యా సంవత్సరంలో పదోతగతి చదువుకున్న వీరంతా తొలుత ఓచోట కలుసుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థులు డి.రాజుకుమార్, రామ్మోహన్‌రావు, ముప్పిన శ్రీను, కర్రి సూరిబాబు, చక్ర పద్మ తదితరుల ఆధ్వర్యంలో ఇక్కడ కలుసుకున్నారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను కాసేపు నెమరు వేసుకున్నారు.

ఆ తరువాత అంతా సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. నాటి వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యనారాయణరాజును అంతా కలిసి ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

ఎల్బీపీ అగ్రహారం ఎత్తిపోతలపై ఎమ్మెల్యే సమీక్ష



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, జూలై 17 : లింగభూపాలపుర అగ్రహారం ఎత్తిపోతల పథకం పనులను పునఃప్రారంభించాలని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఏపీఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం ఏపీఎస్ఐడీసీ డీఈఈ ఎం.కామరాజు, ఏఈఈ అనుదీప్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం అయ్యారు. ఎత్తిపోతల పథకం పనులు ఎందుకు నిలిచిపోయాయో అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రైతులు తమ భూముల్లో పైపులైన్ వేయవద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో పనులు నిలిచిపోయాయని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే.. అభ్యంతరం చెబుతున్న రైతుల నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో పైపులైన్ చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డు పక్కన ఉన్న గెడ్డ కాలువలో నుంచి పైపులైన్ నిర్మించవచ్చని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే గెడ్డ కాలువపై గ్రామ పంచాయితీ నిర్మించిన సీసీ డ్రైనేజ్ కొంత మేర దెబ్బతింటుందని, డామేజ్‌పై అభ్యంతరం లేదని గ్రామ పంచాయతీ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. దీంతో సమావేశంలో పాల్గొన్న రైతు నాయకులు తమరాన దాసు, దొండా శ్రీను, తమరాన శంకర్, నాయుడులకు పైపులైన్ నిర్మాణానికి గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజును కోరారు. పంచాయతీ అనుమతి పొందిన అనంతరం ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే రాజు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

కృష్ణాదేవిపేటలో చిరుజల్లులు



చిరుజల్లులతో చిత్తడిగా మారిన రహదారులు

కృష్ణాదేవిపేట, జూలై 17 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో బుధవారం ఉదయం గంటల తరబడి చిరుజల్లుగా వర్షం పడింది. నాలుగు రోజులుగా పడుతున్న ఈ జల్లులతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే గ్రామాల్లో ఉన్న చెరువులు, వాగులు వర్షం నీటితోకళకళలాడుతున్నాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలతో పంట పొలాలకు సాగునీరు అందుబాటులోఉన్నట్టేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాలింతలకు 100 బెడ్‌షీట్లు వితరణ



బెడ్‌షీట్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ గవర్నర్ వెంకటేశ్వరరావు

నర్సీపట్నం, జూలై 17 : రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ అధికారిక పర్యటనలో భాగంగా ఏరియా ఆస్పత్రిలోని బాలింతలకు 100 బెడ్ సీట్లు, చిన్న పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరావు అధికారిక పర్యటన జరిగింది. ముందుగా ఆయన వాసవీ పంచాయతన దేవాలయంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలో బాలింతలకు బెడ్ షీట్లు, చిన్న పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎం.మహేశ్‌కుమార్, కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ట్రెజరర్ కొండలరాయుడు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. అధ్యక్షుడుగా పద్మనాభుని కొండలరాయుడు, కార్యదర్శిగా పెనుగొండ రమేశ్, కోశాధికారిగా సుతాపల్లి శ్రావణ్ ఎంపికయ్యారు.

వీరభద్రునిపేటలో వైద్య పరీక్షలు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

చీడికాడ, జూలై 17 : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు దూరమవుతాయని చీడికాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు సూచించారు. మండలంలోని వీరభద్రునిపేటలో జ్వరాలు అధికంగా ఉండడంతో మంగళవారం రాత్రి వైద్య రక్త పరీక్షలు నిర్వహించారు. ముగ్గురికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, ఆశవర్కరు కొల్లి వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

బెండ రైతుకు ధరపై బెంగ

- 10 కిలోలు రూ.50 దాటని పరిస్థితి
- ఉసూరు మంటున్న రైతులు
- దిగుబడి అధికంతో తగ్గిన డిమాండ్



మార్కెట్‌కు అధికంగా వచ్చిన బెండ

దేవరాపల్లి, జూలై 17 : రైతులు మార్కెట్‌కు తెచ్చిన బెండ కాయలకు ధరలు లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. బుధవారం మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన రైతులు ధర పలకకపోవడంతో నిరాశకు గురయ్యారు. క్రేటు (పది కిలోలు) యాభై రూపాయలు కూడా ధర పలకని పరిస్థితి ఉంది. గత రెండు రోజులు నుంచి బెండకాయలు ఇదే ధర పలుకుతున్నాయి. స్థానిక వనదేవీశ్వర ఆలయం వద్ద అమ్మకానికి సోమవారం మినహా ప్రతిరోజూ రైతులు కూరగాయలు తెస్తుంటారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు పది కిలో మీటర్ల దూరం నుంచి రైతులు కూరగాయలు, ఆకుకూరలు తెస్తుంటారు. ప్రతిరోజు వెయ్యి టన్నుల వరకు విశాఖపట్నం, విజయనగరం జిల్లా వేపాడ మండలం, పాడేరు నుంచి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తుంటారు. విశాఖపట్నం రైతు బజార్లకు అవసరమైౖ కూరగాయలు ఇక్కడ నుంచే రవాణా చేస్తుంటారు. ఉదయం 6 నుంచి పది గంటలతో ఇక్కడ మార్కెట్ ముగుస్తుంది. అయితే ఈసారి బెండకాయల దిగుబడి అధికంగా ఉండడంతో ధర భారీగా తగ్గిపోయింది. మధ్యాహ్నం 12 గంటల వరకూ వేచి చూసినప్పటికీ బెండకాయలు క్రేటు యాభై రూపాయలకు మించి పలకకపోవడంతో రైతులు ఉసూరుమన్నారు. చాలామంది రైతులు కనీస ధర లేకపోతే ఎలా అంటూ ఆవేదనతో తెచ్చిన బెండకాయలను తీసుకొని వెళ్లిపోయారు. కొంతమంది రైతులు మాత్రం తమ పరిస్థితిపై తామే జాలిపడుతూ అమ్ముకున్నారు.



కనీసం ధర పలకక సరకును ఇంటికి తీసుకుపోతున్న ఓ రైతు

ఘనంగా ముగిసిన జగన్నాథ రథోత్సవాలు



జగన్నాథుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు, గవిరెడ్డి తదితరులు

మాడుగుల, జూలై 17 : మాడుగుల కేంద్రంలో జగన్నాథస్వామి రథయాత్ర ముగింపు ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జగన్నాథస్వామికి కల్కి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి స్వామి అత్తవారిళ్లయిన ఇంద్రజుమ్నంకు చేరుకున్న నాటి నుంచి భక్తులకు దశవతారాలతో జగన్నాథస్వామి రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఇంద్రజుమ్నం నుంచి స్వామివారి ఆలయానికి రథయాత్ర భారీ ఊరేగింపుగా తిరిగి ప్రధాన ఆలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంద్రజుమ్నం నిర్మాణానికి చర్యలు : ఎమ్మెల్యే

జగన్నాథస్వామి ఇంద్రజుమ్నం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆయన జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. అనంతరం గవర వీధి శతకంపట్టు వద్ద కొలువైయున్న మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు టీడీపీ, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు వద్దాది రంజిత్‌వర్మ, ఇళ్లపు రమేష్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, లెక్కల కాశిబాబు, సూర్యనారాయణ రాజు, ఢిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వరరావు, పుప్పాల రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

కొళాయి కనెక్షన్లకు చర్యలు



కొళాయి కలెక్షన్లు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, జూలై 17 : మేజర్ పంచాయతీ ఏఎల్‌పురం ఎస్టీ కాలనీలో బుధవారం ఇంటింటికి కొళాయి కనెక్షన్ల పనులు ప్రారంభించారు. ఇంటింటి కొళాయిలు లేక తాగునీటికి ఎస్టీ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతుండటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు. దీంతో వారం క్రితం గొలుగొండ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ సుదీషన ఏఎల్ పురాన్ని పరిశీలించి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. దీంతో సుమారు 50 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు అవసరమని గుర్తించారు. అంతేకాకుండా గ్రామంలో మిగిలిన వీధుల్లో పూర్తిస్థాయిలో కొళాయి కలెక్షన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని సుదీషన్ తెలిపారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

- వేకుల జాము నుంచే ఆలయాల వద్ద భక్తుల క్యూ



నర్సీపట్నంలో దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు



దేవరాపల్లి : పూజలు చేస్తున్న భక్తులు

నర్సీపట్నం, జూలై 17 : తొలి ఏకాదశి సందర్భంగాశ్రీవేంకటేశ్వర ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారి దర్శనం కోసం భారీగా క్యూ కట్టారు. మహిళలు ఆలయం ఆవరణలోని వేప చెట్టు వద్ద దీపారాధన చేశారు. తురకబడి రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే.. బలిఘట్టం ఉత్తర వాహినిలో వెలసిన శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో పూజారి భద్రాచల రామం ఆధ్వర్యంలో స్వామి వారి వ్రతాలు నిర్వహించారు. కొత్త బయపురెడ్డిపాలెంలోని శ్రీభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట : తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట తదితర గ్రామాల్లో కనకదుర్గ, షిర్డీసాయి, రామాలయం, శివాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయం 6 గంటలకే భక్తులు బారులు తీరారు. ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపలి : తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఉమామహేశ్వరీ దేవీ ఆలయం, తిమిరాం, పెద నందిపల్లి, కొత్తపెంట, బి.కింతాడ గ్రామాల్లో శివాలయాలు, అలాగే మారేపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం నుంచి క్షీరాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. చంద్రమౌళి నాగేశ్వరరావు శర్మ, ఆదిత్య, మూర్తి పురోహితులు పూజలు చేయించారు. ఆలయ ధర్మకర్త లలితా ప్రసాద్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

ప్రాంతీయ పశు వైద్యశాల ఎ.డి.చిట్టినాయుడు



అందుబాటులో ఉన్న విత్తనాలతో సిబ్బంది

మాడుగుల రూరల్, జూలై 17 : మండలంలోని అన్ని పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల్లో పశుగ్రాస విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 900 కిలోల కాకిజొన్న, 600 కిలోల మొక్కజొన్న పశుగ్రాస విత్తనాలు 75 శాతం రాయితీపై పాడి రైతులకు అందిస్తామని చెప్పారు. 5 కిలోల మొక్కజొన్న రూ.340లు కాగా రాయితీ రూ.255లు మినహాయించి రూ.85లకు రైతులకు ఇస్తామన్నారు. 5 కిలోల కాకిజొన్న రూ.460లు కాగాను రాయితీ రూ.345లు పోను రూ.115కు అందిస్తామని చెప్పారు. రెండో దఫాలో మండలానికి 900 కిలోల కాకిజొన్న, 530 కిలోల మొక్కజొన్న, అలచంద గడ్డి విత్తనాలు అందుబాటులోకి తీసుకువస్తాయని చిట్టినాయుడు తెలిపారు.

ఇసుక అక్రమ తరలింపు.. ఆపేదేలే!

- బీఎస్‌పేటలో అగని ఇసుక తవ్వకాలు
- జిరాయితీ భూముల నుంచి టైర్లబండ్లపై రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు

మాకవరపాలెం, జూలై 17 : మండలంలో బీఎస్‌పేట సర్పానది అనుకోని ఉన్న జిరాయితీ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గతంలో ఇవే భూముల్లో ఎక్సకవేటర్లతో ఇసుక తవ్వకాలు జరిపితే అప్పట్లో ప్రస్తుత ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నిలదీయడంతో తాత్కాలికంగా తవ్వకాలు నిలిపివేశారు. అయితే ఇప్పుడు అవే భూముల్లో మళ్లీ టైరు బండ్లతో తరలించి కొందరు ఇసుక అమ్మకాలు సాగిస్తున్నారు. బీఎస్‌పేటలో ఉన్న సర్పానదికి ఆవతల వైపు ఉన్న పక్క గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు సుమారు ఐదు ఎకరాల జిరాయితీ భూమి కొనుగోలు చేశారు. ఈ భూమిలో ఇసుక నిల్వలు ఎక్కువగా ఉండటంతో ఇసుకను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. బీఎస్‌పేట గ్రామానికి చెందిన సుమారు 20 టైరుబండ్ల రైతులు ఈ భూమిలో నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఇక్కడ రూ.300కు కొనుగోలు చేసి, మాకవరపాలెం పరిసరాల్లో రూ.1200కు అమ్ముతున్నారు.



జిరాయితీ భూమిలో ఇసుక నిల్వలు



టైర్ల బండిపై తరలిస్తున్న ఇసుక

అలాగే.. అప్పన్నదొరపాలెంలో కొంతమంది ట్రాక్టర్లతో గెడ్డల నుంచి, నదుల నుంచి ఇసుకను తరలించి లారీలకు అమ్మకాలు జరుపుతున్నారు. మాకవరపాలెం సర్పానది నుంచి దర్జాగా పోలీసు స్టేషన్ ముందు నుంచే ఇసుక ట్రాక్టర్లతో తరలిపోతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ తవ్వకాలను నియంత్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఫార్మా కంపెనీల్లో భద్రత కరువు

...5వ పేజీ తరువాయి

భయాందోళనతో పరుగులు తీశారు.

మొక్కుబడి తనిఖీలు

ఫార్మా కంపెనీల్లో ఉద్యోగుల భద్రత, ప్రమాదాల నివారణకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారనే దానిపై విచారణ జరపాల్సిన అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక, అగ్నిమాపక శాఖల అధికారులు ఏడాదిలో కనీసం నాలుగు పర్యాయాలు తనిఖీలు చేసి పరిస్థితులను చక్కదిద్దే దిశగా కంపెనీల యాజమాన్యాలకు మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉన్నా ఆ విధంగా జరగడం లేదు. ఫార్మా కంపెనీల్లో కంట్రోల్ కాని రియాక్టర్లు ఉంటాయి. వాటిలో నిరంతరాయంగా హై టెంపరేచర్ ద్రవాలను మరిగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో నిపుణులైన ఉద్యోగులు, కార్మికులు ఆయా రియాక్టర్లు పనిచేసే విభాగాల్లో అధిక ఉష్ణోగ్రత కారణంగా రియాక్టర్లు పేలిపోకుండా, ఇతరత్రా అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా పర్యవేక్షించాల్సి వుంటుంది. కానీ ఫార్మా కంపెనీల్లో నిపుణులైన ఉద్యోగులు లేకపోవడం వల్లే తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లు పేలడం, పైపులైన్ లీకేజీల కారణంగా తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యర్థ రసాయనాలు ప్రవహించే పైపులైన్‌లు సక్రమంగా ఉన్నాయా?, లేదా? అనేది తరచూ పర్యవేక్షించాలి. వ్యర్థ రసాయనాలు శుద్ధి చేసిన తరువాతే బయటకు పంపాల్సి ఉన్నా ఆ విధమైన చర్యలు చేపట్టక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో అత్యధిక శాతం మంది నిపుణులైన ఉద్యోగులు లేని కారణంగా తరచూ జరుగుతున్నా ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

తీగలు సరి చేయరా..!



మాడుగుల, జూలై 17 : మాడుగుల కేంద్రం శివారు ఖండివరం వెళ్లే దారి మరిడిమాంబ ఆలయ సమీపంలో విద్యుత్ తీగల పాదులకు అల్లుకొని కిందకు వేలాడుతున్నాయి. ఈ వైర్లు సరిచేయాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించు కోవడం లేదని స్థానిక రైతులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం.. వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో ఏ క్షణంలో ఏ జరుగుతుందోనని భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారు లు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

భక్తిశ్రద్ధలతో మొహరం



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు తదితరులు

మాడుగుల, జూలై 17 : మాడుగుల కేంద్రంలో మొహరం వేడుకలను ముస్లిం సోదరులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లచావడి వద్ద వారి దేవుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా 9వ రోజు మంగళవారం రాత్రి ఉపవాసాలతో అగ్నిగుండం ఏర్పాటు చేసి గుండం తొక్కిన అనంతరం బుధవారం అనుపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుతో పాటు పలువురు హాజరు కాగా పీర్లు చావడివద్ద గురువు హుస్సేన్ పత్యేక పార్థనలు నిర్వహించారు. మైనారిటీ కార్యదర్శి మస్తాన్, పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఐదు వారాలుగా అందని 'ఉపాధి' కూలి

గొలుగొండ, జూలై 17 : గత ఐదు వారాలుగా తమకు వేతనాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కూలీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సుమారు 4,500 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నారు. అయితే వీరికి కూలీ డబ్బులు చెల్లించలేదు. ఇప్పటికైనా పలుమార్లు విన్నవించామని, అయినప్పటికీ కూలి డబ్బులు ఇవ్వలేదని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు కూలి డబ్బులు ఇప్పించాలని కోరుతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నర్సీపట్నం అర్బన్, జూలై 17 : ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.జాన్‌లింకన్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతనసమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల,గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

పశుగ్రాస విత్తనాలు సిద్ధం



చీడికాడకు చేరుకున్న విత్తనాలు

చీడికాడ, జూలై 17 : మండలంలో ఉన్న పాడిరైతులకు పశుగ్రాస విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పెదగోగాడ పశువైద్య కేంద్రం వైద్యాధికారి కె.రాఘవమ్మ తెలిపారు. బుధవారం జిల్లా ఇక్కడకు విత్తనాల సరుకు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయితీ మొక్కజొన్న విత్తనాలు కిలో రూ.68లు, కాకిజొన్న విత్తనాలు కిలో రూ.92లుగా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. మండలంలోని 13 రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని, కావలసిన రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాల వద్దకు వెళ్లి తీసుకోవాలని కోరారు.

రోలుగుంటలో ఏకాదశి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట, జూలై 17 : తొలి ఏకాదశి పురష్కరించుకుని బుధవారం ఆలయాన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే భక్తులు కుటుంబ సమేతంగా దైవదర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని రోలుగుంటలో వెంకటేశ్వరాస్వామి ఆలయం, నిండుగొండ, కుసర్లపూడి, కంచుగుమ్మల, అడ్డసరం, శరభవరం తదితర గ్రామాల్లో ఆలయాల్లో భక్తులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదబ్రాహ్మణులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు పంపించారు.

బాధిత మహిళకు శస్త్రచికిత్స

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డా.రవికిరణ్‌తో బాధిత మహిళ

నక్కపల్లి, జూలై 17 : ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మైనర్ ఆపరేషన్ కోసం వచ్చిన ఓ మహిళ వివరాలను సదరు యూనిట్ సిబ్బంది అప్‌లోడ్ చేయగా, ఆమె మరణించినట్టు రావడంతో వైద్య సిబ్బంది సహా బాధిత మహిళ కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. నక్కపల్లి ఆస్పత్రిలో వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబంధించి బుధవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై అధికారులు వెంటనే స్పందించారు. నక్కపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన సాధిరెడ్డి లక్ష్మి అనే మహిళ చేతి వేలు దెబ్బతినడంతో ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు.కానీ ఆర్యోగ్యశ్రీ కోసం అప్‌లోడ్ చేయగా, ఆమె చనిపోయినట్టు సమాచారం వచ్చింది. ఈ విషయమై బాధిత కుటుంబసభ్యులు, స్థానికులు విస్మయానికి గురయ్యారు.ఇదిలావుంటే, బుధవారం ఉదయం నక్కపల్లి యాభై పడకల ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రవికిరణ్ బాధిత మహిళ లక్ష్మి చేతి వేలికి ఆపరేషన్ పూర్తి చేశారు. ఆమె ఆరోగ్యంగానే ఉన్నట్టు ఆయన తెలిపారు.